# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 18 జనవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## మున్నేరు-పాలేరుకు రూ.162.57 కోట్లు కేటాయింపు

- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మున్నేరు-పాలేరు గ్రావిటి నిర్మాణానికి రూ162.57 కోట్లు కేటాయించినట్టు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాజెక్ట్ వల్ల ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో 1.38 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి స్థిరీకరణ, పాలేరు రిజర్వార్ ఎగువ భాగంలో 40 వేల ఎకరాలకు భరోసా లభిస్తుందని తెలిపారు. గార్ల మండలం ముల్కనూర్ గ్రామంలోని చెక్ డ్యామ్ ద్వారా నీరు మళ్లించి నిర్మించే మున్నేరు-పాలేరు లింక్ పథకంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ స్టేజ్-2 ను బలోపేతం చేయడంతో పాటు భక్త రామదాసు ఎత్తిపోతల పథకం కింద ఉన్న డీబీఎం 60 ద్వారా ఖరీఫ్ సాగుకు 70,308 ఎకరాల ఆయకట్టుకు అదనపు నీటి లభ్యత చేకూరుతుందని వివరించారు. సూర్యాపేట జిల్లాలోని మోతే ఎత్తిపోతల పథకం ద్వారా డీబీఎం-71 కింద ఉన్న 46,712 ఎకరాలకు నిరంతరం సాగునీటిని అందించవచ్చని ఉత్తమ్ తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికలకు కీలక ముందడుగు

- 10 కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీల రిజర్వేషన్లు ఖరారు
- ఒకటి-రెండు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదలకు అవకాశం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ప్రభుత్వం 10 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలకు సంబంధించిన రిజర్వేషన్లను ఖరారు చేసింది. శనివారం సాయంత్రానికి మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఆదివారం ఉదయానికి రిజర్వేషన్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) ప్రభుత్వం పంపనుందని సమాచారం. ప్రభుత్వం జీవో జారీ చేసిన వెంటనే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు ఎస్ఈసీ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లోనే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది.

**మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు**

ఈసారి ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. రిజర్వేషన్లకు సంబంధించి వివరాలను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మున్సిపల్ శాఖ డైరెక్టర్ శ్రీదేవి అఫీషియల్‌గా ప్రకటించారు. కార్పొరేషన్లలో రిజర్వేషన్లు ఒకటి ఎస్సీ, ఒకటి ఎస్టీ, 3 బీసీలకు కేటాయించారు. కొత్తగూడెం కార్పొరేషన్‌కు ఎస్టీకి రిజర్వ్ చేశారు. రామగుండం కార్పొరేషన్‌కు ఎస్సీ జనరల్, మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌కు బీసీ మహిళకు అవకాశం కల్పించారు. మంచిర్యాల కార్పొరేషన్‌కు బీసీ జనరల్, కరీంనగర్ కార్పొరేషన్‌కు బీసీ జనరల్ అభ్యర్థులకు కేటాయించారు. అదేవిధంగా 121 మున్సిపాలిటీల్లో 5 ఎస్టీ, 17 ఎస్సీ, 38 బీసీలకు అభ్యర్థులకు కేటాయించారు. జీహెచ్ఎంసీ కార్పొరేషన్‌తో పాటు ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్ కార్పొరేషన్లను జనరల్ మహిళకు, గ్రేటర్ వరంగల్ జనరల్ అభ్యర్థికి రిజర్వ్ చేశారు.

వేములవాడ మున్సిపల్ చైర్మన్ బీసీ జనరల్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం. 121 మున్సిపాలిటీల్లో 38 స్థానాలు(31.4%) బీసీలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం. తెలంగాణలో కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్ పర్సన్ల రిజర్వేషన్లు ఖరారు చేసిన ప్రభుత్వం. మొత్తం 121 మున్సిపాలిటీల్లో 38 బీసీలకు, 17 ఎస్సీలకు, 5 ఎస్టీలకు కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు.

**కార్పొరేషన్లలో రిజర్వేషన్లు**

10 మున్సిపల్ కార్పొరేషన్లలో
ఎస్సీ -- 1,
ఎస్టీ -- 1,
బీసీ--3 (వాటిలో ఒకటి మహిళలకు కేటాయించారు)
జనరల్ కేటగిరీలోని ఐదు స్థానాల్లో నాలుగు స్థానాలను మహిళలకు కేటాయించడం విశేషం.

**మున్సిపాలిటీలలో కేటాయింపులు**

మొత్తం 121 మున్సిపాలిటీల్లో

ఎస్సీ -- 17,
ఎస్టీ -- 5,
బీసీ -- 38,
జనరల్ -- 61 స్థానాలను కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

**కార్పొరేషన్ల వారీగా రిజర్వేషన్లు**

కొత్తగూడెం కార్పొరేషన్ -- ఎస్టీ (జనరల్)
రామగుండం కార్పొరేషన్ -- ఎస్సీ (జనరల్)
మహబూబ్‌నగర్ కార్పొరేషన్ -- బీసీ (మహిళ)
మంచిర్యాల కార్పొరేషన్ -- బీసీ (జనరల్)
కరీంనగర్ కార్పొరేషన్ -- బీసీ (జనరల్)
ఖమ్మం కార్పొరేషన్ -- జనరల్ (మహిళ)
నిజామాబాద్ కార్పొరేషన్ -- జనరల్ (మహిళ)
వరంగల్ కార్పొరేషన్ -- జనరల్
జీహెచ్ఎంసీ--జనరల్ (మహిళ)
నల్లగొండ కార్పొరేషన్ -- జనరల్ (మహిళ)

రిజర్వేషన్ల ఖరారుతో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల సందడి మరింత వేగం పుంజుకోనుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## నీటి పారుదల ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి

- ట్రిపుల్ ఐటీ, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి లక్ష్యం
- ఐఐఎం కోసం ప్రధాని వద్ద వినతి
- వెనుకబాటుకు కారణం సాగునీటి, విద్యావకాశాల లేమి
- పాలమూరును అత్యంత అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దుతాం
- సీఎం రేవంత్ రెడ్డి
- వెయ్యి కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం






**బలగం టీవీ, మహబూబ్‌నగర్**

ఒకప్పుడు తట్టపని, మట్టి పని, పార పని కోసం వలసలు వెళ్లిన పాలమూరును తెలంగాణలోనే అత్యంత అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి తెలంగాణకు వచ్చే వారు తప్పనిసరిగా పాలమూరు జిల్లాను సందర్శించేలా అభివృద్ధి చేయాలన్నదే తన కల అని ఆయన తెలిపారు. 'ప్రజాపాలన-ప్రగతి బాట' కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో వెయ్యి కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. గతంలో రాష్ట్రానికి వచ్చిన నేతలు గ్రాంట్ల కోసం పాలమూరులోని పేదరికాన్ని చూపించిన సందర్భాలు బాధాకరమని, పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల సమస్యలను పరిష్కరించి అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నామని చెప్పారు.

పాలమూరు వెనుకబాటుకు ప్రధాన కారణం సాగునీటి సౌకర్యాలు, విద్యావకాశాల లేమేనని పేర్కొన్న సీఎం, విద్య కోసం అవసరమైన నిధులు సమకూర్చే పూర్తి బాధ్యత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. పాలమూరులో వెలుగులు నింపాలనే సంకల్పంతో ట్రిపుల్ ఐటీతో పాటు వందల కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించామని తెలిపారు. ప్రాజెక్టులకు అనుమతులు, నిధులు రావాలంటే కేంద్రంతో సమన్వయం అవసరమని పేర్కొన్న ఆయన, గ్రామ అభివృద్ధికి సర్పంచులు ఎంత కీలకమో, దేశాభివృద్ధికి ప్రధానమంత్రి కూడా అంతే కీలకమని వ్యాఖ్యానించారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడబోమని స్పష్టం చేశారు.తెలంగాణకు ఐఐఎం సాధించి, దాన్ని మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను ప్రధాని నరేంద్ర మోదీకి వినిపిస్తామని తెలిపారు. విద్య, నీటిపారుదల రంగాలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పాలమూరు--రంగారెడ్డి, ఎస్సెల్‌బీసీ, జూరాల వంటి ప్రాజెక్టుల్లో పెండింగ్ పనులను పూర్తి చేస్తామని చెప్పారు. ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్ అండ్ ఆర్ సమస్యలను ముందుగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నిరక్షరాస్యత, పేదరికం మన ప్రధాన శత్రువులని, చదువుకు అడ్డు తగిలే వారిని సహించబోమని సీఎం హెచ్చరించారు. పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా పాలమూరును అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.

ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులు తప్ప గత పదేళ్లలో ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా మంజూరు కాలేదని విమర్శించారు. బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, జూరాల, పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి వంటి ప్రాజెక్టులు పూర్తికాలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దండాపూర్ భూసేకరణకు నిధులు ఇచ్చామని, సంగంబండకు రూ.10 కోట్లు, కల్వకుర్తి ఎత్తిపోతల పథక భూసేకరణకు రూ.75 కోట్లు విడుదల చేశామని వివరించారు. మక్తల్--నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకానికి రూ.1500 కోట్లు మంజూరు చేశామని, భూమి కోల్పోయిన రైతులకు నష్టపరిహారం పూర్తిగా చెల్లించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీలు మల్లు రవి, డీకే అరుణ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## లక్ష్యం ఉన్నతంగా ఉండాలి



- కష్టపడే తత్వం అలవర్చుకోండి
- విద్య ఒక్కటే జీవితాన్ని మార్చగలదు
- సీఎం రేవంత్ రెడ్డి
- మహబూబ్‌నగర్‌లో ఐఐఐటీకి సీఎం భూమిపూజ

**బలగం టీవీ, మహబూబ్‌నగర్**

లక్ష్యాన్ని ఉన్నతంగా పెట్టుకుని, దాన్ని సాధించేందుకు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. భాష, జ్ఞానం పెంచుకునేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని, నిబద్ధత, క్రమశిక్షణతో కూడిన విద్యే సమాజంలో ఉన్నతంగా నిలబెడుతుందని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం చిట్టబోయినపల్లిలో రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఐఐఐటీ) భవన నిర్మాణానికి సీఎం భూమిపూజ

మిగితా 4వ పేజీలో

## రాష్ట్రంలో భారీ ఎత్తున ఐపీఎస్‌ల బదిలీలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో మరోసారి భారీ ఎత్తున ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో కొందరు ఏఎస్పీలకు డీసీపీ లేదా ఎస్పీలుగా పదోన్నతులను కట్టబెట్టింది. ఎక్కువగా హైదరాబాద్‌తో పాటు కొత్తగా సృష్టించిన జోన్‌లలో ఐపీఎస్‌లకు పోస్టింగ్‌లను ఇచ్చింది. ఇందులో కొందరు అధికారుల పోస్టింగ్‌లను రాష్ట్రంలో రాబోయే మునిసిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కూడా చేసినట్టు తెలుస్తోంది.

## రోహిత్ వేముల చట్టం తీసుకొస్తాం



- సామాజిక న్యాయం, సంస్థాగత బాధ్యతకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో రోహిత్ వేముల చట్టాన్ని ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం వెల్లడించారు. సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువలు, విద్యాసంస్థల్లో సమానత్వం కోసం ఈ చట్టం కీలకమని ఆయన పేర్కొన్నారు. రోహిత్ వేముల ఘటనపై జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నిరంతరంగా పోరాటం చేస్తోందని భట్టి తెలిపారు. తెలంగాణలో రోహిత్ వేముల చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి లేఖ రాసిన విషయాన్ని గుర్తు చేశారు.


**అన్ని వర్గాలతో సంప్రదింపుల అనంతరం చట్టం**

ఈ చట్టాన్ని తొందరపాటు లేకుండా, అన్ని వర్గాలు, సంబంధిత భాగస్వాములతో సంప్రదింపులు జరిపిన అనంతరం తీసుకొస్తామని భట్టి స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ విషయంలో అత్యంత గంభీరంగా ఉందన్నారు. శనివారం ప్రజాభవన్‌లో జస్టిస్ ఫర్ రోహిత్ వేముల క్యాంపెయిన్ కమిటీ సభ్యులతో భట్టి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతిపాదనలు, సూచనలను ప్రభుత్వం సానుకూలంగా

మిగితా 4వ పేజీలో

## మేడారం జాతరకు భారీ ఏర్పాట్లు

- 2026 సమ్మక్క--సారలమ్మ జాతరకు మూడు కోట్ల మంది రానున్న అంచనా
- మేడారంలో మంత్రులు, ఉన్నతాధికారులు
- కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రపంచ ప్రఖ్యాత గిరిజనుల మహోత్సవమైన మేడారం సమ్మక్క--సారలమ్మ జాతర--2026ను ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఈ ద్వైవార్షిక జాతరకు సుమారు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

**మేడారంలో క్షేత్రస్థాయి పర్యవేక్షణ**

భక్తులకు నిరాఘాట దర్శనం, భద్రత, సౌకర్యాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. జాతర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు మేడారంలోనే మకాం వేశారు. భారీగా వచ్చే భక్తులను సమర్థంగా నియంత్రించేందుకు మేడారం పరిసర ప్రాంతాన్ని 8 పరిపాలనా జోన్లు, 42 సెక్టార్లుగా విభజించారు. ప్రతి జోన్‌కు జిల్లా స్థాయి అధికారి, ప్రతి సెక్టార్‌కు మండల స్థాయి అధికారి బాధ్యతలు అప్పగించారు. గద్దెలు, జంపన్న వాగు, ఆర్టీసీ బస్టాండ్, ఊరట్టం, శివారంసాగర్, నార్లాపూర్, పడిగాపూర్ తదితర కీలక ప్రాంతాల్లో కంట్రోల్ రూములు, మిస్సింగ్ పర్సన్స్ క్యాంపులు, అత్యవసర స్పందన బృందాలు ఏర్పాటు చేశారు.

**42 వేల మందితో భారీ యంత్రాంగం**

జాతర నిర్వహణకు 21 ప్రభుత్వ విభాగాలకు చెందిన 42,027 మంది అధికారులు, సిబ్బందిని నియమించారు. వీరికి తోడుగా 2,000 మంది గిరిజన యువ వాలంటీర్లు సేవలు అందించనున్నారు.

నిరంతర కమ్యూనికేషన్ కోసం 27 శాశ్వత మొబైల్ టవర్లు, 33 తాత్కాలిక టవర్లు ఏర్పాటు చేశారు. అదనంగా 450 వీఎచ్ఎఫ్ కమ్యూనికేషన్ సెట్లు అందుబాటులో ఉంచారు. మొత్తం 525 రోడ్డు సమస్యలను గుర్తించి మరమ్మతులు, కొత్త రహదారులు, కల్వర్టుల నిర్మాణం పూర్తి చేశారు. 1,418 ఎకరాల్లో 42 పార్కింగ్ ప్రాంతాలను అటవీ, గిరిజన సంక్షేమ శాఖల

మిగితా 4వ పేజీలో

## తుది దశకు మేడారం ఏర్పాట్లు

- మంత్రి సీతక్క



**బలగం టీవీ, మేడారం**

ఈ నెల 28 నుంచి 31వరకు జరగనున్న మేడారం మహా జాతరకు సర్వం సిద్ధమైనట్టు మంత్రి సీతక్క వెల్లడించారు. తల్లుల దర్శనానికి వచ్చే సందర్శ కులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా చూడాలని సెక్టార్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. జాతర ప్రారంభం కాకముందే ముందస్తు మొక్కులు చెల్లించుకున్న వారు కాకుండానే జాతర తేదీల్లో సుమారు మూడు కోట్ల మంది తరలివచ్చే అవకాశం ఉందని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. గత జాతరలో పని చేసిన అనుభవం ఉన్న అధికారులు రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా మేడారానికి రప్పించి వారి సేవలను వినియోగిస్తున్నారు. అధికారులు, సిబ్బంది తోపాటు ఆదివాసీ యువతను సైతం మేడారంలో సేవలందించేందుకు ఉపయోగించ నున్నట్టు మంత్రి చెప్పారు.

## బీఆర్ఎస్ ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

- అనుమతిలేదంటూ ఎక్కడికక్కడ అరెస్టు చేసిన పోలీసులు



**బలగం టీవీ, హైదరాబాద్**

సికింద్రాబాద్‌ను ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బీఆర్ఎస్ పిలుపునిచ్చిన శాంతియుత ర్యాలీ ఉద్రిక్తతకు దారితీసింది. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ఈ ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించారు. ఉదయం నుంచే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాలు, ఎంజీ రోడ్, మోండా మార్కెట్, జనరల్ బజార్ ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఉదయం నుంచే వివిధ డివిజన్‌ల నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు, వ్యాపారస్తులు రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుండగా పోలీసులు వారిని అడ్డగించి అరెస్టు చేశారు. యువనేత తలసాని సాయి కిరణ్ యాదవ్ నల్ల దుస్తులు ధరించి నల్ల బెలూన్ లతో సికింద్రాబాద్ బచావ్ నినాదాలతో నిరసన తెలుపుతూ ఎంజీ రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్దకు వెళ తుండగా పోలీసులు అరెస్ట్ చేసి గోషామహల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తామన్నా అక్రమంగా అరెస్ట్‌లు చేయడమేంటని, 144 సెక్షన్, కర్ఫ్యూ అమలులో ఉందా అన్నట్టు వేలాదిమంది పోలీసులు వచ్చి ర్యాలీని అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. సికింద్రాబాద్ చరిత్ర, అస్తిత్వం లేకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. తమ అస్తిత్వం కోసం పోరాడుతుంటే అక్రమంగా అరెస్ట్ చేయడం అన్యాయం అన్నారు. ఈ నెల 5న ర్యాలీకి అనుమతి కోరితే ఉద్దేశ పూర్వకంగా శుక్రవారం రాత్రి అనుమతిని రిజెక్ట్ చేశారని చెప్పారు. ర్యాలీకి అనుమతి లేకుంటే ర్యాలీకి ముందురోజు పోలీసు అధికారులు తాము చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించరు కదా అని ప్రశ్నించారు. అరెస్టులతో తమ ఉద్యమం ఆగదని చెప్పారు. ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు తెలుపుతున్నారని, రెట్టింపు ఉత్సాహంతో ఫిబ్రవరి మొదటి వారంలో పెద్ద ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఎంజీ రోడ్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నల్ల జెండాలు, నల్ల కండువాలతో 'సికింద్రాబాద్ బచావో' నినాదాలు చేస్తూ నిరసన చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్పొరేటర్ సామల హేమతో పాటు లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పవన్ కుమార్ గౌడ్, పలువురు నేతలు అరెస్టయ్యారు. నిరసనల నేపథ్యంలో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడ్డాయి.



## సికింద్రాబాద్ అస్తిత్వాన్ని చెరిపే తుగ్లక్ నిర్ణయాలు



- పేర్లు మార్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ పనిగా మారింది
- శాంతి ర్యాలీని అడ్డుకోవడం అప్రజాస్వామికం
- మళ్లీ అధికారంలోకి వచ్చాక సికింద్రాబాద్ జిల్లా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**

సికింద్రాబాద్ పేరును, అస్తిత్వాన్ని చెరిపివేయాలనే తుగ్లక్ తరహా నిర్ణయాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్--సికింద్రాబాద్ జంట నగరాలు చారిత్రకంగా, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నగరాలుగా ఉన్నాయని గుర్తు చేశారు.గతంలో పుస్తకాలలో చదివిన తుగ్లక్ పాలన ఈరోజు రేవంత్ రెడ్డి పాలనలో స్పష్టంగా కనిపిస్తోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఆరు గ్యారెంటీలు, వందల హామీలతో అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయకుండా, పేర్లు మార్చడంపైనే ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఆరోపించారు.టీఎస్‌ను టీజీగా మార్చడం, తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం, బతుకమ్మను తొలగించడం, అధికార చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తీసేయడం వంటి చర్యల వల్ల ప్రజలకు ఏ లాభం జరిగిందో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు.


ప్రజల దగ్గరికి పాలన తీసుకెళ్లాలనే ఉద్దేశంతో కేసీఆర్ విశాల దృక్పథంతో వికేంద్రీకరణ చేపట్టారని తెలిపారు. కొత్త గ్రామాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలు ఏర్పాటు చేసి 10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చారని గుర్తు చేశారు. హైదరాబాద్‌లోనూ వార్డులు, జోన్లను పెంచి అభివృద్ధి నిధులు కేటాయించారని అన్నారు.

హైదరాబాద్--సికింద్రాబాద్ తెలంగాణ ప్రజల అస్తిత్వ చిహ్నాలని పేర్కొన్న కేటీఆర్, రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాల వల్ల సికింద్రాబాద్ చారిత్రక గుర్తింపు పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. దీనికి వ్యతిరేకంగా సికింద్రాబాద్‌లోని అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. సికింద్రాబాద్ ప్రజల కోరిక మేరకు శాంతియుత ర్యాలీ నిర్వహించేందుకు

మిగితా 4వ పేజీలో

## లక్కీ డ్రాల పేరుతో సోషల్ మీడియాలో మోసాలు

- కార్లు, ప్లాట్లు అంటూ ప్రజల నుంచి డబ్బులు వసూలు
- ఇన్‌ఫ్లుయెన్సర్లపై కఠిన చర్యలు
- సీపీ సజ్జనార్ హెచ్చరిక



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సోషల్ మీడియా పాపులారిటీని అడ్డం పెట్టుకుని 'లక్కీ డ్రాల' పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న ఇన్‌ఫ్లుయెన్సర్లపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఫాలోవర్ల సంఖ్యను ఆసరాగా చేసుకుని ప్రజల నుంచి డబ్బులు దండుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం 'ఎక్స్(ట్విటర్) వేదికగా స్పందించిన సీపీ, గతంలో బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేసిన కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్లు ఆ అక్రమ దందాకు అడ్డుకట్ట పడటంతో ఇప్పుడు లక్కీ డ్రాల అవతారం ఎత్తారని ధ్వజమెత్తారు. కార్లు, ఖరీదైన బైకులు, ఇళ్లు, డీజే సెట్లు వంటి భారీ బహుమతులు ఇస్తామంటూ ప్రజలను ఎర వేసి నిలువునా మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

రీల్స్‌లో ఆర్భాటపు ప్రచారాలు చేస్తూ వాస్తవంలో మోసాలకు పాల్పడుతున్న పలువురు ఇన్‌ఫ్లుయెన్సర్ల వీడియోలను సీపీ సజ్జనార్ 'ఎక్స్'లో షేర్ చేశారు. ఇలాంటి మోసాలు పూర్తిగా చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. లక్కీ డ్రాల పేరుతో మోసాలకు పాల్పడేవారిపై 'ది ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ బ్యానింగ్ యాక్ట్ -- 1978' కింద కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ వ్యవహారంలో వారు సినిమా సెలబ్రిటీలైనా, సోషల్ మీడియా స్టార్లైనా సరే చట్టం ముందు ఎవరూ తప్పించుకోలేరని తేల్చిచెప్పారు. లక్కీ డ్రాల పేరుతో ఎవరైనా మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిసిన వెంటనే సమాచారం అందించాలని సీపీ ప్రజలను కోరారు. ఇందుకోసం డయల్ 100 లేదా హైదరాబాద్ సిటీ పోలీస్ వాట్సాప్ నెంబర్ 9490616555కు వివరాలు పంపవచ్చని తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రలోభాలకు గురిచేసే మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## అంబేద్కర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత శనివారం అంబేద్కర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రిజిస్టర్లు, మందుల నిల్వలు మరియు వైద్య సేవల నాణ్యతను ఆమె నిశితంగా పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాలు ఆసుపత్రిలోని టీకాల నిల్వలను పరిశీలించిన డాక్టర్ రజిత, ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ వంద శాతం టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఏ ఒక్క బిడ్డ కూడా టీకా తీసుకోకుండా మిగిలిపోకూడదని స్పష్టం చేశారు. ఎన్.సి.డి (చీజణ) కార్యక్రమంలో రక్తపోటు (ధ్రూ), డయాబెటిస్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ మరియు నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల పురోగతిపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ నెలాఖరు నాటికి ఆన్‌లైన్ డేటా ఎంట్రీలో కనీసం 75 శాతం ప్రగతి సాధించాలని అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించారు. గర్భిణీ స్త్రీల నమోదు సక్రమంగా జరగాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను (చీశీతీఘ్రశ్రీ ఐవశ్రీఱఙవతీఱవం) ప్రోత్సహించాలని సూచించారు. సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా లేదా సమయానికి హాజరు కాకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డాక్టర్ రజిత హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, హెల్త్ సూపర్వైజర్లు మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వేములవాడ మున్సిపల్ చైర్మన్ స్థానం బీసీ జనరల్‌కు..

- **మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ల రిజర్వేషన్లపై ప్రభుత్వ ఉత్తర్వులు**

**బలగం టీవీ, వేములవాడ**

తెలంగాణ రాష్ట్రంలోని కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ల రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. వేములవాడ మున్సిపల్ చైర్మన్ స్థానం బీసీ జనరల్ కేటగిరీకి కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 121 మున్సిపాలిటీల్లో 38 స్థానాలను (31.4 శాతం) బీసీలకు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే 17 మున్సిపాలిటీలను ఎస్సీలకు, 5 మున్సిపాలిటీలను ఎస్టీలకు కేటాయిస్తూ రిజర్వేషన్లు ఖరారు చేసింది. స్థానిక సంస్థల్లో సామాజిక సమతుల్యతను కాపాడటం, అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ రిజర్వేషన్ విధానం రాబోయే మున్సిపల్ ఎన్నికలకు వర్తించనుంది.



## బూత్ నిర్మాణ్ అభియాన్- మండల కార్యశాల సమావేశం

**బలగం, వేములవాడ;**

బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండల శాఖ అధ్వర్యంలో మండల అధ్యక్షులు బుర్ర శేఖర్ గౌడ్ అధ్యక్షతన బూత్ నిర్మాణ్ అభియాన్- మండల కార్యశాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుర్ర శేఖర్ గౌడ్ మాట్లాడుతూ: బూత్ స్థాయే బీజేపీకి బలమైన పునాది.ప్రతి నాయకుడు ముందుగా తమ తమ బూత్‌లను పటిష్టం చేయాలి.పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలి. బలమైన బూత్‌లు బలమైన పార్టీని నిర్మిస్తాయి. కాబట్టి ప్రతి బూత్ కమిటీ సమగ్ర ఓటరు డేటా, నిరంతర ప్రచారం మరియు పోలింగ్ రోజుకు పూర్తి స్థాయి సంసిద్ధతను కలిగి ఉండాలి. సమన్వయం అత్యంత కీలకం. కార్యకలాపాలు మరియు జిల్లా వ్యూహాన్ని సమర్థవంతంగా అనుసంధానించాలి. శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు చురుకైన పర్యవేక్షణ మరియు మద్దతు ద్వారా బూత్‌లను బలోపేతం చేయాలి.ప్రతి స్థాయిలో సంస్థాగత ప్రణాళికలను క్రమశిక్షణతో అమలు చేయడం ఎన్నికల విజయాన్ని మరియు రాజకీయ బలాన్ని నిర్ణయిస్తుంది.కార్యకర్తల అంకితభావమే పార్టీ విజయాలకు మూలాధారం.ప్రతి వార్డు -- ప్రతి బూత్‌లో బలమైన నిర్మాణం అవసరం.ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో అమలవుతున్న అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి.స్థానిక సమస్యలపై దృష్టి సారించి ప్రజల పక్షాన నిరంతరం పనిచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ చింతపల్లి వెంకటేశ్వరరావు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జింక అనిల్ మండల ప్రధాన కార్యదర్శులు చంద్రగిరి ప్రశాంత్, గుండెకర్ల లక్ష్మణ్ మండల ఉపాధ్యక్షులు బి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఏరుగొక్కుల రమేష్ మండల కార్యదర్శులు సంజీవరెడ్డి, బూర శేఖర్ సీనియర్ నాయకులు రేగుల పరుశురాం, పల్లె బోయిన అంజయ్య, యాదవ్ జక్కుల మధు, నాయకులు చింతకుంట నరసయ్య, ఎర్రం లక్ష్మీనర్సు, పేరంగాని మల్లేశం, గణేష్ ముద్దంగుల రవి, కంసాని రాము, ఎడ్ల హరీష్, దామోదర్ రెడ్డి, రేగుల మల్లేశం ,మర్రిపెద్ది వికాస్, లింగంపల్లి సాయికృష్ణ, ముడికే శ్రీనివాస్, కనకరాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నస్వామి స్టేడియానికి మ్యాచ్‌ల నిర్వహణకు అనుమతి

**బలగం టీవీ, బెంగళూరు:**

బెంగళూరులోని ప్రతిష్టాత్మక ఎం. చినస్వామి స్టేడియంలో ఐపీఎల్‌తో పాటు అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు కర్ణాటక ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. గతంలో చోటుచేసుకున్న దుర్ఘటన నేపథ్యంలో విధించిన నిషేధాన్ని తాజాగా ఎత్తివేస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. గత ఐపీఎల్ సీజన్‌లో ఆర్‌సీబీ విజేతగా నిలిచిన సందర్భంగా నిర్వహించిన సంబరాల్లో భారీ తొక్కిసలాట చోటుచేసుకొని 11 మంది మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన అనంతరం ప్రజా భద్రత దృష్ట్యా చిన్నస్వామి స్టేడియంలో అన్ని రకాల క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణపై ప్రభుత్వం నిషేధం విధించింది.తాజాగా స్టేడియం భద్రతా ఏర్పాట్లు, ప్రేక్షకుల నియంత్రణ, అత్యవసర సేవల ప్రణాళిక తదితర అంశాలపై సమీక్ష నిర్వహించిన ప్రభుత్వం, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, కఠిన షరతులకు లోబడి మ్యాచ్‌లు నిర్వహించుకోవచ్చని అనుమతి ఇచ్చింది.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని, ప్రేక్షకుల సంఖ్యపై నియంత్రణ ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# విద్యార్థి దశ నుంచే క్రీడలకు ప్రోత్సాహం..

- **గ్రామీణ స్థాయి క్రీడాకారులు ప్రతిభ చూపేలా పోటీల నిర్వహణ**
- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
- **సీఎం కప్ పోటీలు ప్రారంభం**
- **సిరిసిల్లలో టార్చ్ ర్యాలీని ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే**






**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

విద్యార్థి దశ నుంచే క్రీడలకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. సీఎం కప్ పోటీల ప్రారంభం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శనివారం సీఎం కప్ టార్చ్ ర్యాలీని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి ప్రారంభించారు. అంబేద్కర్ చౌక్ నుంచి నేతన్న విగ్రహం వరకు విప్, ఇంచార్జి కలెక్టర్, ఎస్పీ, అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ తీశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఒలింపిక్స్ లో దేశం నుంచి ఎక్కువ సంఖ్యలో పతకాలు సాధించాలనే ఉద్దేశ్యంతో ప్రజా ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతుందని తెలిపారు. సీఎం కప్ పేరిట రాష్ట్రంలోని గ్రామ స్థాయి నుంచి ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికి తీసి జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. వివిధ క్రీడ విభాగాల్లో రాష్ట్రంలోని అన్ని గ్రామాల నుంచి షెడ్యూల్ ప్రకారం పోటీలు నిర్వహిస్తుందని వివరించారు. క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు, శిక్షణ అందిస్తుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇస్తుందని, యువత, విద్యార్థులకు ఉత్తమ శిక్షణ, ఉపాధి కల్పించే అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

**రాష్ట్రస్థాయిలో ఎక్కువ పతకాలు సాధించాలి..**

జిల్లాలోని విద్యార్థులు, యువత సీఎం కప్ పోటీల్లో పాల్గొని ఎక్కువ సంఖ్యలో పతకాలు సాధించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. సీఎం కప్ పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు, యువత మొబైల్ ఫోన్లు తక్కువ ఉపయోగించాలని, క్రీడలు, మైదానాల్లో ఎక్కువ సమయం గడపాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడంతో శారీరక దారుఢ్యం, పాజిటివ్ ఎనర్జీ పెరుగుతుందని తెలిపారు. సీఎం కప్ టార్చ్ ర్యాలీ సిరిసిల్లలో మొదలై జిల్లాలోని అన్ని మండలాల్లో సాయంత్రం వరకు పూర్తి అవుతుందని తెలిపారు.

జిల్లా నుంచి విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించేలా జిల్లా క్రీడల, విద్యా శాఖ ఆధ్వర్యంలో శిక్షణ అందిస్తామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం జిల్లాలో మొత్తం 34 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి పోటీలు నిర్వ హించి.. రాష్ట్రస్థాయికి పంపిస్తామని పేర్కొన్నారు. అన్ని క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహిం చి జిల్లా నుంచి టీమ్ లను వచ్చే నెలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపి స్తామని పేర్కొన్నారు. క్రీడాకారులకు అన్ని సౌక ర్యాలు కల్పిస్తామని వివరించారు. విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**ఇదీ షెడ్యూల్..**

గ్రామపంచాయతీ లెవల్లో ఈ నెల 17 నుంచి 22 వ తేదీ వరకు, మండల, మున్సిపాలిటీ జోనల్ లెవెల్ లో ఈ నెల 28 నుంచి 31 వరకు, జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు, జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 9 నుండి 12వ తేదీ వరకు, రాష్ట్రస్థాయిలో ఫిబ్రవరి 20 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాను రద్దు చేస్తే ఆమరణ నిరాహార దీక్ష

### జిల్లా ఉద్యమకారుడు మారవేణి రంజిత్ కుమార్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**




రాజన్న సిరిసిల్ల జిల్లాను రద్దు చేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోకపోతే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధంగా ఉన్నామని జిల్లా ఉద్యమకారుడు మారవేణి రంజిత్ కుమార్ స్పష్టం చేశారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటుతోనే అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధ్యమైందని, అభివృద్ధి బాటలో ముందుకు సాగుతున్న జిల్లాను రద్దు చేయడం అంటే ప్రజలను అభివృద్ధికి దూరం చేయడమేనని అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లాను రద్దు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తే, జిల్లా ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తారని హెచ్చరించారు. జిల్లా ఏర్పాటు కోసం ఉద్యమం జరిగినప్పుడు మద్దతు తెలిపిన ముఖ్యమంత్రి,ఇప్పుడు జిల్లా రద్దు కుట్ర చేయడం తగదని అన్నారు. జిల్లాను రద్దు చేస్తే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి జిల్లా ప్రజలు గుణపాఠం చెబుతారని,ఉద్యమాల గడ్డగా పేరుగాంచిన సిరిసిల్ల నుంచి మరో పెద్ద పోరాటం తప్పదని, జిల్లా రద్దు జరిగితే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రజల్లో తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కోసం ఎన్నో పోరాటాలు చేసి, మెడలు వంచి జిల్లా సాధించామని, ఆ ఉద్యమంలో ఎంతోమంది నాయకులు కేసులు ఎదుర్కొని జైలు జీవితాలు గడిపామని గుర్తు చేశారు. అవసరమైతే మళ్లీ కేసులు, జైలు జీవితాలకు కూడా సిద్ధమని అన్నారు.ప్రభుత్వం వెంటనే జిల్లా రద్దు ఆలోచనను విరమించుకోవాలని, లేకపోతే తీవ్ర ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యమకారులు ప్రశాంత్, అక్కేమ్ నాగరాజు, గొండ్లే తిరుపతి, టేకు మధు, హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

## పురుషులకు కూడా ఫ్రీ బస్ ప్రయాణం..!

- **తమిళనాడులో రానున్న అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేసిన ఏఐడీఎంకే పార్టీ**

**బలగం టీవీ, చెన్నై:**



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమరానికి ముందే అన్నా డీఎంకే పార్టీ ఓటర్లపై వరాల జల్లు కురిపించింది. శనివారం విడుదల చేసిన తన ఎన్నికల మేనిఫెస్టోలో ఊహించని హామీలతో అందరినీ ఆశ్చర్యపరిచింది. ముఖ్యంగా మహిళలతో పాటు పురుషులకు కూడా సిటీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్న హామీ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.


**ప్రధాన హామీలు ఇవే..**

సాధారణంగా మహిళలకు మాత్రమే ఉండే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని, అధికారంలోకి వస్తే పురుషులకు కూడా వర్తింపజేస్తామని పార్టీ ప్రకటించింది. మహిళలకు ఆర్థిక భరోసా ప్రతి మహిళకు నెలకు రూ. 2,000 ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అమ్మ టూ వీలర్ స్కీమ్ ఈ పథకం కింద 5 లక్షల మందికి ద్విచక్ర వాహనాల కొనుగోలుపై రూ. 25,000 సబ్సిడీ ఇస్తామని తెలిపారు. సొంత ఇంటి కల గ్రామీణ ప్రాంతాల్లో సొంత భూమి ఉండి ఇల్లు లేని వారికి కాంక్రీట్ ఇళ్ల నిర్మాణం చేపడతామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇచ్చే పని దినాలను 100 రోజుల నుండి 150 రోజులకు ఉపాధి హామీ పెంచుతామని హామీ ఇచ్చారు.

## భక్తి చరిత్ర ప్రకృతి కలిసిన

# పవిత్ర క్షేత్రం అంజన్న ఆలయం





- **కోరికలు తీర్చే క్షేత్రంగా భీముని మల్లారెడ్డిపేట అంజన్న ఆలయం.**
- **ప్రకృతి ఒడిలో ఆధ్యాత్మిక అనుభూతి**

**బలగం టివి, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ నేలపై ప్రకృతి సౌందర్యం, పురాణ వైభవం, కాకతీయుల శిల్పకళ ఒకేచోట కలసిన అరుదైన ప్రాంతం భీముని మల్లారెడ్డి పేట. అద్దంలా మెరిసే రాతి బండలు, చుట్టూ పరుచుకున్న గుట్టలు, పచ్చగా నవ్వే పొలాలు, నిత్యం మ్రోగే జలధారల మధ్య ఈ ఆలయ సముదాయం సందర్శకులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను ప్రసాదిస్తుంది.రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలంలో వెలసిన ఈ శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం కోరిన కోరికలు తీర్చే క్షేత్రంగా భక్తుల విశ్వాసాన్ని పొందింది. తొమ్మిది అడుగుల ఎత్తైన ఏకశిలా విగ్రహంలో స్వామి దర్శనమివ్వడం ఈ క్షేత్రానికి ప్రత్యేక ఆకర్షణ.

**రామ--హనుమల అద్భుత సమ్మేళనం**

ఈ ఆలయ సముదాయంలోని అతి విశేషం శ్రీరాముడు, ఆంజనేయ స్వామి ఆలయాలు పరస్పరం అభిముఖంగా ఉండటం. హనుమంతుని కంటి కాంతి నిత్యం శ్రీరాముని పాదాలను తాకేలా విగ్రహాల అమరిక ఉండటం భక్తులను మాత్రమే కాదు, శిల్పకళాభిమానులను కూడా మంత్రముగ్ధులను చేస్తుంది. ఇది కాకతీయుల కాలం నాటి అపూర్వ శిల్ప నైపుణ్యానికి ప్రతీక.

**పురాణాల మాటల్లో భీముని మల్లారెడ్డిపేట**

ఈ ప్రాంతానికి సంబంధించిన స్థల పురాణం ఆసక్తికరంగా ఉంటుంది. ఒకప్పుడు ఆలయాల వద్ద ప్రసాదాలను అడ్డుకున్న బ్రహ్మారాక్షసి నుంచి భక్తులను రక్షించేందుకు ఆంజనేయ స్వామి స్వయంగా అవతరించినట్టు స్థానికుల నమ్మకం. కలలో ఆజ్ఞ ఇచ్చినట్లుగానే తొమ్మిది అడుగుల ఏకశిలా విగ్రహం భూమిలో వెలుగుచూసిన కథ భక్తుల్లో అపార విశ్వాసాన్ని కలిగిస్తుంది.అలాగే ద్వాపర యుగంలో పాండవులు ఈ ప్రాంతంలో సంచరించారని, భీముడు ఒక బండను నెత్తితో ఎత్తిన గుర్తుగా ఇప్పటికీ ఒక గుహ కనిపిస్తుందని చెబుతారు. ఆ



కారణంగానే ఈ గ్రామానికి 'భీముని మల్లారెడ్డిపేట' అనే పేరు వచ్చిందని స్థానికుల కథనం.

**ఎండిపోని గుండం -- ప్రకృతి అద్భుతం**

ఆలయం గుట్టపై ఉండటం వల్ల పై నుంచి వచ్చే నది రెండు భాగాలుగా విడిపోయి ఆలయం ముందు మళ్లీ కలుస్తుంది. వర్షాకాలంలో ఈ దృశ్యం అద్భుతంగా కనిపిస్తుంది. మాండవ్య ముని తపస్సుతో పవిత్రమైన ఈ నది కాలక్రమేణా మానేరు నదిగా ప్రసిద్ధి చెందింది.ఆలయ ఆవరణలో ఉన్న గుండం ఎన్నటికీ ఎండిపోదు. కరువు వచ్చినా నీరు తగ్గదని భక్తుల నమ్మకం. ఈ జలాలను పవిత్రంగా భావిస్తూ భక్తులు స్నానాలు చేస్తారు. ప్రకృతి, విశ్వాసం ఇక్కడ ఒకటై పోతాయి.

**కాకతీయుల శిల్పకళకు నిలువెత్తు నిదర్శనం**

శ్రీ సీతారామాలయం, వెంకటేశ్వర స్వామి ఆలయం, శివాలయం కాకతీయుల కాలంలో నిర్మితమైనవిగా భావిస్తున్నారు. స్థానికంగా లభించిన బండరాళ్లతో రెండంతస్తులుగా నిర్మించిన ఈ ఆలయాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా నిలిచి ఉన్నాయి. డంగు సున్నంతో చేసిన రాతి నిర్మాణాలు, సున్నితమైన శిల్పాలు ఆ కాలపు కళా వైభవాన్ని చాటుతున్నాయి.

**పండుగలు, జాతరలు -- జనసంద్రం**

ప్రతి సంవత్సరం మాఘ అమావాస్య రోజున ఇక్కడ పెద్ద జాతర నిర్వహిస్తారు. కామారెడ్డి, సిద్దిపేటతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు తరలివస్తారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి ఉత్సవాలు కూడా ఇక్కడ ఎంతో వైభవంగా జరుగుతాయి.

జనవరి 18, 2026 ఆదివారం రోజున మాఘ అమావాస్య సందర్భంగా పెద్ద ఎత్తున జాతర మహోత్సవం జరగనుంది.

**ఎలా వెళ్లాలంటే**

హైదరాబాద్ నుండి వచ్చే వారు కామారెడ్డి మీదుగా 160 కిలోమీటర్లు ప్రయాణించి, భీముని మల్లారెడ్డి పేట చేరుకోవచ్చు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం నుండి కామారెడ్డి సిరిసిల్ల మార్గంలో32 కిలోమీటర్లు ప్రయాణిస్తే, గొల్లపల్లి స్టేజ్ నుండి భీముని మల్లారెడ్డి పేటకు చేరుకోవచ్చు. బస్ సౌకర్యం, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి.సిద్దిపేట నుండి వచ్చేవారు కామరెడ్డి రహదారిలో 45 కిలోమీటర్లు ప్రయాణిస్తే లింగన్నపేట మీదుగా భీముని మల్లారెడ్డి పేట చేరుకోవచ్చు, బస్ సౌకర్యం, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి.

## రహీంఖాన్ పేట్ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుల స్వీకారణ..

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలం, రహీంఖాన్ పేట గ్రామంలో ఆదర్శ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి (2026 -2027), 6 నుండి 10 వ తరగతి వరకు ప్రవేశ పరీక్షలకు జనవరి 17 వ తేదీన నోటిఫికేషన్ వెలువడినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. జనవరి 28 వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 వ తేదీ వరకు 6 నుంచి 10 వ తరగతి వరకు ఆన్లైన్లో దరఖాస్తులను స్వీకరిస్తారని, హాల్ టికెట్లను ఏప్రిల్ 9 వ తేదీ నుండి డౌన్లోడ్ చేసుకొనే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ 19 న ఆదివారం ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఆరో తర గతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గం వరకు మరియు 7 నుంచి 10 వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గం వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం -అధికారిక వెబ్ సైట్ http://tgms.telangana.gov. in సంప్రదించాలని సూచించారు.


## ఇద్దరు వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు..

- **మండల ఎస్సై రమాకాంత్**



**బలగం టీవీ, బోయినిపల్లి:**

తేదీ 14-01- 2026 రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నీలోజిపల్లి గ్రామానికి చెందిన కత్తెరపాక దేవదర్శన్ తండ్రి ఉషయ్య, అను వ్యక్తిని అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కులం పేరుతో దూషించినందున తేది 15-01-2026 న కత్తెరపాక దేవదర్శన్ పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేయగా నీలోజిపల్లి గ్రామానికి చెందిన కొనుకటి శ్రీకాంత్ మరియు కొనుకటి శివకృష్ణలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు బోయినిపల్లి మండల ఎస్సై రమాకాంత్ తెలిపారు.



## బోయినిపల్లి డబుల్ రోడ్డు నిర్మాణానికి బీజేపీ నాయకుల వినతి

**బలగం టీవీ, బోయినిపల్లి:**

డబుల్ రోడ్డు నిర్మాణం చేయడానికి నిధులు సమకూర్చాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రికి వినతి పత్రం బిజెపి బోయినిపల్లి మండల నాయకులు అందజేశారు. భారతీయ జనతాపార్టీ బోయినిపల్లి మండల శాఖ అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వర్యులు, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ను రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల నాయకులు, కార్యకర్తలు కలిసి మకర సంక్రాంత్రి పండగ శుభాకాంక్షలు తెలిపారు. బోయినిపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనుల నిధుల కోసం వివరించగా, అతి త్వరలో మండలానికి నిధులు కేటాయిస్తామని తెలిపారు. వీటితో పాటుగా ప్రధానంగా గంగాధర మండలం నాగులమల్యాల గ్రామం నుండి బోయినిపల్లి మీదుగా వేములవాడ వరకు ఉన్న సింగల్ బీటీ రోడ్డును, డబుల్ రోడ్డు నిర్మాణం చేయడానికి నిధులు సమకూర్చాలని వారికి విజ్ఞప్తి చేయగా వెంటనే దాన్ని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్తంభంపల్లి సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నర్సింహాచారి, మాజీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సుంకపాక చక్రవర్తి, జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి, కొండం శ్రీనివాస్ రెడ్డి, మెరుపుల గంగాధర్ గౌడ్,పసికంటి వెంకటేష్, మారం ఉపేందర్, అన్నమల్ల మోహన్ బాబు, సారంపల్లి రాజు, ఇల్లందుల బాలయ్య, జనగామ లక్ష్మణ్,ఐలయ్య, ముసుకు విజయేందర్ రెడ్డి, నవీన్, కిరణ్, తిరుపతి, రాజు, మహేశ్, రమేశ్, ఆంజనేయులు, సాయికుమార్, కట్ట విజయ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గెలిచిన రెడ్డి ప్రతినిధులు ఆదర్శవంతమైన పరిపాలన చేయాలి

- **జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి పిలుపు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయితీ ఎన్నికల్లో గెలుపొందిన రెడ్డి సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనమైన ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన రెడ్డి సంఘ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా రెడ్డి కులానికి చెందిన అనేక మంది సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు విజయం సాధించడం ఆనందకరమని తెలిపారు. గ్రామ పంచాయితీ స్థాయిలో గెలిచిన ప్రతినిధులు ప్రజలకు ఆదర్శంగా నిలిచే విధంగా పారదర్శకమైన, అభివృద్ధి ప్రధానమైన పాలన అందించాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో రానున్న మునిసిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో రెడ్డి కుల బాంధవులు పోటీ చేసి విజయం సాధించాలని పిలుపునిచ్చారు. రెడ్డిలంతా ఐక్యంగా ఉండి స్థానిక ఎన్నికల్లో తమ సత్తా చాటాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెరిగి నిరుద్యోగం తగ్గడంతో పాటు ఉత్పత్తులు పెరిగి దేశ అభివృద్ధికి తోడ్పడతాయని తెలిపారు. జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్ పొందిందని, సంఘానికి 80+ కింద విరాళాలు అందించే వారికి ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. సంఘ భవన నిర్మాణం కోసం నిధుల సమీకరణను పార్టీలకు అతీతంగా, రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో చేపడతామని తెలిపారు. పారదర్శక పాలనతో సంఘ అభివృద్ధికి పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని, ప్రతి ఒక్కరూ సంఘ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు కూర అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెలుముల స్వరూప రెడ్డి, మాజీ జెడ్పీ ఛైర్మన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, కోర్ కమిటీ సభ్యుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూర్మాని లింగారెడ్డి, కరీంనగర్ డీసీఎంఎస్ ఛైర్మన్ సురేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల నాగిరెడ్డి, సెస్ డైరెక్టర్లు సందుపట్ల అంజిరెడ్డి, రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మడుపు ప్రమోదరెడ్డి, ఎగుమామిడి కృష్ణారెడ్డి, నరెడ్ల రాఘవరెడ్డి, నరసింహారెడ్డి, తిరుపతి రెడ్డి, ప్రసాద్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి దుంద్రా జలజా రెడ్డి, తిరుపతి రెడ్డి, కనకారెడ్డి, బాల్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, పాతూరి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జంగంరెడ్డిపల్లెలో శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు..

- **స్వామిని దర్శించుకున్న జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే**

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం జంగం రెడ్డి పల్లెలో నిర్వహిస్తున్న శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతర ఉత్సవాల ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జాతరకు భారీగా తరలివస్తున్న భక్తుల కోసం చేపట్టిన ఏర్పాట్లపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# లక్ష్యం ఉన్నతంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి సంభాషిస్తూ విద్య ప్రాధాన్యతను వివరించారు. విద్యారంగ అభివృద్ధినే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని సీఎం స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, మహబూబ్‌నగర్ జిల్లాలో ఐఐటీతో పాటు ఇంజినీరింగ్, లా, మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యూపీఎస్సీ సివిల్స్‌కు సిద్ధమయ్యే యువతకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం పేదలకు ఇవ్వగలిగేది విద్య మాత్రమేనని సీఎం అన్నారు. విద్య ఒక్కటే జీవితాన్ని మార్చగల శక్తి కలిగి ఉందని, 25 ఏళ్ల వరకూ కష్టపడి చదువుకోవాలని సూచించారు. ఎంత ఎదిగినా తల్లిదండ్రులను, పుట్టిన ఊరును మరిచిపోవద్దన్నారు.

రూ.200 కోట్లతో నిర్మించనున్న ఐఐటీ భవనాన్ని ఏడాది కాలంలో పూర్తి చేస్తామని సీఎం వెల్లడించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఎలాంటి తొణుకు--బెనుకు లేకుండా ఆత్మవిశ్వాసంతో మాట్లాడటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీలు మల్లు రవి, డీకే అరుణ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రోహిత్ వేముల చట్టం తీసుకొస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు.

కర్ణాటకలో రూపొందించిన రోహిత్ వేముల చట్ట ముసాయిదాను కమిటీ సభ్యులు తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించారు. విద్యాసంస్థల్లో వివక్షను అరికట్టడం, విద్యార్థులు--అధ్యాపకుల హక్కులను పరిరక్షించడం, సంస్థాగత వేధింపులకు బాధ్యత నిర్ధారించడమే ఈ చట్ట లక్ష్యమని వారు వివరించారు. రోహిత్ వేముల కేసులో పారదర్శకంగా, కాలపరిమితితో విచారణ జరిపి న్యాయం చేయాలని కమిటీ డిమాండ్ చేసింది. రోహిత్ మృతితో సంబంధించి నమోదైన నాన్‌బెయిలబుల్ కేసుల్లో 50 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులకు ఉపశమనం కల్పించాలని కోరారు. ఈ కేసులను మానవీయంగా, చట్టబద్ధంగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కర్ణాటక నుంచి అంబేద్కరైట్ నేతలు, న్యాయ నిపుణులు, విద్యావేత్తలు, హైదరాబాద్ నుంచి రోహిత్ వేముల కుటుంబ సభ్యులు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. రోహిత్ వేముల చట్టం అమల్లోకి వస్తే, ఉన్నత విద్యాసంస్థల్లో వివక్షకు చెక్ పెట్టడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల గౌరవం, హక్కులకు బలమైన చట్టపరమైన రక్షణ లభిస్తుందని భట్టి విక్రమార్క అన్నారు.

# మేడారం జాతరకు భారీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో అభివృద్ధి చేశారు.మిషన్ భగీరథ ద్వారా 5,482 తాగునీటి ట్యాపులు ఏర్పాటు చేశారు. జంపన్న వాగులో స్నానాలకు 119 డ్రెస్సింగ్ రూములు సిద్ధం చేశారు. నీటి శుద్ధికి నిరంతర క్లోరినేషన్ చేపట్టారు. 285 బ్లాకుల్లో 5,700 మరుగుదొడ్లు ఏర్పాటు చేయగా, 5,000 మంది పారిశుద్ధ్య కార్మికులు, 150 ట్యాంకర్లు, 100 ట్రాక్టర్లు, 18 స్వీపింగ్ మిషన్లు, 12 జేసీబీలు విధుల్లో ఉంటాయి.

టీఎస్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో 196 ట్రాన్స్‌ఫార్మర్లు, 911 విద్యుత్ స్తంభాలు, 65.75 కిలోమీటర్ల లైన్లు ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు 28 డీజిల్ జనరేటర్లను సిద్ధం చేశారు.

తెలంగాణ ఆర్టీసీ 4,000 బస్సులతో 51,000 ట్రిప్పులు నడపనుంది. 10,441 మంది ఆర్టీసీ సిబ్బంది విధుల్లో ఉండగా, ప్రధాన రూట్లలో గంటకు 15 బస్సుల చొప్పున సేవలు అందించనున్నారు.

**వైద్య, భద్రతా ఏర్పాట్లు**

5,192 మంది వైద్య సిబ్బంది, 30 అంబులెన్సులు, 40 బైక్ అంబులెన్సులు, 50 పడకల ప్రధాన ఆసుపత్రి, రోజుకు 30 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. జంపన్న వాగులో ప్రమాదాలు నివారించేందుకు 210 మంది నిపుణులైన ఈతగాళ్లు, 100 ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉంటాయి. అగ్నిమాపక శాఖ 15 ఫైర్ ఇంజిన్లు, 268 సిబ్బందిని మోహరించింది.

సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో గద్దెల సమీపంలోని టీటీడీ కళ్యాణ మండపంలో ప్రత్యేక మీడియా సెంటర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాకు అన్ని సౌకర్యాలు కల్పించారు. మేడారం జాతర--2026ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో, సురక్షితంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అధికారులు తెలిపారు. చరిత్రలో తొలిసారి మేడారంలో తెలంగాణ కేబినెట్ సమావేశం నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

## మున్సిపాల్టీల రిజర్వేషన్ల వివరాలు

8 ఎస్టీ కేటగిరీ
1. కల్లూరు: ఎస్టీ (జనరల్)
2. భూత్పూర్: ఎస్టీ (జనరల్)
3. మహబూబాబాద్: ఎస్టీ (జనరల్)
4. కేసముద్రం: ఎస్టీ (మహిళ)
5. ఎల్లంపేట: ఎస్టీ (మహిళ)

8 ఎస్సీ కేటగిరీ
1. స్టేషన్‌ఘన్‌పూర్: ఎస్సీ (జనరల్)
2. చొప్పదండి: ఎస్సీ (మహిళ)
3. జమ్మికుంట: ఎస్సీ (జనరల్)
4. హుజురాబాద్: ఎస్సీ (మహిళ)
5. ఏదులాపురం: ఎస్సీ (మహిళ)
6. డోర్నకల్: ఎస్సీ (జనరల్)
7. లక్సెట్టిపేట: ఎస్సీ (జనరల్)
8. మూడుచింతల పల్లి: ఎస్సీ (జనరల్)
9. నందికొండ: ఎస్సీ (జనరల్)
10. మొయినాబాద్: ఎస్సీ (జనరల్)
11. గడ్డపోతారం: ఎస్సీ (మహిళ)
12. కోహిర్: ఎస్సీ (జనరల్)
13. ఇంద్రేశం: ఎస్సీ (మహిళ)
14. చేర్యాల: ఎస్సీ (మహిళ)
15. హుస్నాబాద్: ఎస్సీ (జనరల్)
16. వికారాబాద్: ఎస్సీ (మహిళ)
17. మోత్కూరు: ఎస్సీ (మహిళ)

8 బీసీ కేటగిరి
1. ఇల్లందు: బీసీ (మహిళ)
2. జగిత్యాల: బీసీ (మహిళ)
3. జనగాం: బీసీ (జనరల్)
4. భూపాలపల్లి: బీసీ (జనరల్)
5. ఐజ: బీసీ (జనరల్)
6. వడ్డేపల్లి: బీసీ(జనరల్)
7. ఆలంపూర్: బీసీ (జనరల్)
8. బిచ్కుంద: బీసీ (జనరల్)
9. కామారెడ్డి: బీసీ (మహిళ)
10. బాన్సువాడ: బీసీ (మహిళ)
11. ఆసిఫాబాద్: బీసీ(జనరల్)
12. కాగజ్‌నగర్: బీసీ (మహిళ)
13. దేవరకద్ర: బీసీ (మహిళ)
14. చెన్నూరు: బీసీ (మహిళ)
15. మెదక్: బీసీ (మహిళ)
16. ములుగు: బీసీ (మహిళ)
17: కొల్లాపూర్: బీసీ (మహిళ)
18. అచ్చంపేట: బీసీ (మహిళ) (కాలపరిమితి ముగియలేదు)
19. నాగర్‌కర్నూల్: బీసీ (జనరల్)
20. దేవరకొండ: బీసీ (మహిళ)
21. మద్దూరు: బీసీ (జనరల్)
22. పెద్దపల్లి : బీసీ (జనరల్)
23. మంథని: బీసీ (జనరల్)
24. వేములవాడ: బీసీ (జనరల్)
25. షాద్‌నగర్: బీసీ (జనరల్)
26. జిన్నారం: బీసీ (జనరల్)
27. జహీరాబాద్: బీసీ (జనరల్)
28. గుమ్మడిదల: బీసీ (జనరల్)
29. సిద్ధిపేట: బీసీ (జనరల్) (కాలపరిమితి ముగియలేదు)
30. గజ్వేల్: బీసీ (మహిళ)
31. దుబ్బాక: బీసీ (మహిళ)
32. హుజూర్‌నగర్: బీసీ (జనరల్)
33. తాండూరు: బీసీ (జనరల్)
34. పరిగి: బీసీ (మహిళ)
35. కొత్తకోట: బీసీ (మహిళ)
36. ఆత్మకూరు: బీసీ (మహిళ)
37. నర్సంపేట: బీసీ (మహిళ)
38. ఆలేరు: బీసీ (మహిళ)

8జనరల్
1. ఆదిలాబాద్: మహిళ (జనరల్)
2. అశ్వారావుపేట : మహిళ (జనరల్)
3. పర్కాల: అన్‌రిజర్వ్డ్
4. కోరుట్ల: మహిళ (జనరల్)
5. రాయికల్: అన్‌రిజర్వ్డ్
6. మెట్‌పల్లి: అన్‌రిజర్వ్డ్
7. ధర్మపురి: మహిళ (జనరల్)
8. గద్వాల: మహిళ (జనరల్)
9. ఎల్లారెడ్డి: అన్‌రిజర్వ్డ్
10. సత్తుపల్లి: మహిళ (జనరల్)
11. వైరా: మహిళ (జనరల్)
12. మధిర: మహిళ (జనరల్)
13. జడ్చర్ల: అన్‌రిజర్వ్డ్ (కాలపరిమితి ముగియలేదు)
14. తొర్రూర్: అన్‌రిజర్వ్డ్
15. మరిపెడ: మహిళ (జనరల్)
16. క్యాతన్‌పల్లి: మహిళ (జనరల్)
17. బెల్లంపల్లి: మహిళ (జనరల్)
18. రామాయంపేట: మహిళ (జనరల్)
19. నర్సాపూర్: మహిళ (జనరల్)
20. తుప్రాన్: మహిళ (జనరల్)
21. అలియాబాద్: మహిళ (జనరల్)
22. కల్వకుర్తి: మహిళ (జనరల్)
23. చండూరు: అన్‌రిజర్వ్డ్
24. నకిరేకల్: అన్‌రిజర్వ్డ్ (కాలపరిమితి ముగియలేదు)
25. హాలియా: అన్‌రిజర్వ్డ్
26. మిర్యాలగూడ: మహిళ (జనరల్)
27. చిట్యాల: మహిళ (జనరల్)
28. నారాయణపేట: మహిళ (జనరల్)
29. కోస్గి: అన్‌రిజర్వ్డ్
30. మక్తల్: అన్‌రిజర్వ్డ్
31. ఖానాపూర్: అన్‌రిజర్వ్డ్
32. భైంసా: అన్‌రిజర్వ్డ్
33. నిర్మల్: మహిళ (జనరల్)
34. భీంగల్: మహిళ (జనరల్)
35. ఆర్మూర్: మహిళ (జనరల్)
36. బోధన్: అన్‌రిజర్వ్డ్
37. సుల్తానాబాద్: అన్‌రిజర్వ్డ్
38. సిరిసిల్ల: మహిళ (జనరల్)
39. శంకర్‌పల్లి: అన్‌రిజర్వ్డ్
40. చేవెళ్ల: అన్‌రిజర్వ్డ్
41. ఇబ్రహీంపట్నం: అన్‌రిజర్వ్డ్
42: ఆమన్‌గల్: అన్‌రిజర్వ్డ్
43. కొత్తూర్: అన్‌రిజర్వ్డ్ (కాలపరిమితి ముగియలేదు)
44. సదాశివపేట: మహిళ (జనరల్)
45. నారాయణఖేడ్: అన్‌రిజర్వ్డ్
46. ఆందోల్–జోగిపేట: అన్‌రిజర్వ్డ్
47. సంగారెడ్డి: మహిళ (జనరల్)
48. ఇస్నాపూర్: మహిళ (జనరల్)
49. సూర్యాపేట: అన్‌రిజర్వ్డ్
50. తిరుమలగిరి: అన్‌రిజర్వ్డ్
51. కోదాడ: మహిళ (జనరల్)
52. నేరేడుచర్ల: అన్‌రిజర్వ్డ్
53. కొడంగల్: అన్‌రిజర్వ్డ్
54. వనపర్తి: మహిళ (జనరల్)
55. అమరచింత: అన్‌రిజర్వ్డ్
56. పెబ్బేరు: అన్‌రిజర్వ్డ్
57. వర్ధన్నపేట: అన్‌రిజర్వ్డ్
58. పోచంపల్లి: అన్‌రిజర్వ్డ్
59. యాదగిరిగుట్ట: మహిళ (జనరల్)
60. భువనగిరి: మహిళ (జనరల్)
61. చౌటుప్పల్: మహిళ (జనరల్)

# సికింద్రాబాద్ అస్తిత్వాన్ని చెరిపే తుగ్లక్ నిర్ణయాలు

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధమయ్యామని, మొదట అనుమతి ఉందని చెప్పి చివరి నిమిషంలో నిరాకరించి వేలాది మందిని అరెస్టు చేయడం దారుణమని కేటీఆర్ మండిపడ్డారు. కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, సామాన్య ప్రజలను ఎక్కడికక్కడ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని విమర్శించారు.ఇంత అరాచకంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాల్సిన విషయం అధికారం శాశ్వతం కాదని కేటీఆర్ హెచ్చరించారు. శాంతి ర్యాలీని అడ్డుకున్నందుకు ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందవచ్చని, కానీ అది తాత్కాలికమేనని అన్నారు. రాజ్యాంగబద్ధంగా తమ నిరసన హక్కును వినియోగించుకుంటూ కోర్టును ఆశ్రయించి మళ్లీ శాంతి ర్యాలీ నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

**మళ్లీ అధికారంలోకి వచ్చాక సికింద్రాబాద్ జిల్లా**

ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆకాంక్షల మేరకు అన్ని డిమాండ్లను నెరవేరుస్తామని తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఆయన గుర్తించి, ఇదే రాజ్యాంగ స్ఫూర్తి కాదని చెప్పాలని కోరారు.




# గామాలలోని యువత క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే సీఎం కప్ పోటీలు

- **బోయినిపల్లి సర్పంచ్ నల్ల మోహన్**

**బలగం, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రానికి సీఎం కప్ టార్చ్ ర్యాలీ చేరుకోగా, మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద ఘన స్వాగతం పలుకుతూ,గ్రామపంచాయతీ నుండి ప్రభుత్వ పాఠశాల వరకు అధికారులు, ప్రజాప్రతి నిధులు, విద్యార్థులు యువతతో కలిసి ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ: యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మండలానికి గుర్తింపు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశీల, మండల విద్యాధికారి శ్రావణ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్, సెస్ డైరెక్టర్ కొట్టేపెల్లి సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు,కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.




# భగత్ సింగ్ యూత్‌కు సెటిల్ బ్యాట్స్ కిట్టు అందజేసిన అనంతారం సర్పంచ్

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో భగత్ సింగ్ యూత్ సభ్యులకు సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేష్ లు సెటిల్ బ్యాట్స్ కిట్టును అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రజిత వెంకన్న మాట్లాడుతూ యువత కు క్రీడాల పట్ల ఆసక్తి పెంపోందించేందుకు తన వంతు యెల్ల వేళలా సహాయాసహకారాలు అందిస్తానని వారి శ్రేయస్సు కోసం కృషి చేస్తానని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో భగత్ సింగ్ యూత్ సభ్యులు 16 మంది యువకులతో పాటు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు